
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి
5
బుధవారం 14 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.174	260	290
నల్లగొండ	రూ.165	245	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 25.0


విద్యుద్దీపాల వెలుగుల్లో యాదగిరిగుట్ట

సుందరీమణుల రాకకు ముస్తాబు

- యాదగిరిగుట్ట ప్రాంతమంతా విద్యుత్ వెలుగులు
- పోచంపల్లిలో కళాత్మక ప్రదర్శనకు ఏర్పాట్లు

యాదాద్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాలు, భవనాలు, పర్యాటక, ఆధ్యాత్మిక స్థలాలను విశ్వవ్యాప్తం చేసేలా సన్నాహాలు చేస్తోంది. మిస్‌వరల్డ్-2025 వేడుకల్లో భాగంగా గురువారం ప్రపంచ సుందరీమణులు అంతర్జాతీయస్థాయి ఆధ్యాత్మిక, పర్యాటకే కేంద్రంగా రూపుదిద్దుకున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని, తెలంగాణ చేనేత కళాత్మకతకు ప్రసిద్ధి గాంచిన భూదాన్‌పోచంపల్లిని సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో టూరిజంతోపాటు 'ఎక్స్‌పీరీయన్షియల్ హ్యాండ్లూమ్ టూర్ ఎట్ పోచంపల్లి విలేజ్ కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం ముస్తాబు చేస్తోంది. ప్రపంచ మిస్‌వరల్డ్ పోటీలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో జిల్లాయంత్రాంగం పూర్తిగా ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఒక్కో జిల్లా అధికారికి ఒక్కో బాధ్యతను అప్పగించారు. గురువారం సాయంత్రం 5గంటలకు ప్రపంచ సుందరణీమణులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. స్వామివారి దర్శనం సందర్భంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలపై ఈవో వెంకట్రావ్ అధికారులకు దిశానిర్దేశనం చేశారు. గురువారం సాయంత్రం వేళ ఆలయం గర్భగుడితో పాటు మాడవీధుల్లో, విమానగోపురం విద్యుత్ కాంతులతో విరజిమ్మేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాయిగిరి నుంచి యాదగిరిగుట్ట వరకు భారీగా లైటింగ్‌ను ఏర్పాటుచేస్తున్నారు. తెలంగాణలోని చేతివృత్తుల నైపుణ్యాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. పోచంపల్లిలో తయారైన చీరలు దేశ, విదేశాల్లో ప్రాచుర్యం పొందాయి. సాంస్కృతిక వస్త్రాలను, చేనేత వారసత్వాన్ని ప్రపంచ ప్రేక్షకులకోసం ప్రదర్శించేందుకు మిస్ వరల్డ్ కార్యక్రమంలో'ఎక్స్‌పీరీయన్షియల్ హ్యాండ్లూమ్ టూర్ ఎట్ పోచంపల్లి విలేజ్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిస్ వరల్డ్ పోటీదారులు తెలంగాణ చేనేత కళాత్మకతను తెలుసుకుంటారు. గ్రాండ్ ఫ్యాషన్ షోలో వస్త్ర సంప్రదాయాలను, చేనేత కళాత్మకతను గొప్పతనాన్ని చాటడమే లక్ష్యంగా పర్యాటక శాఖ చర్యలు తీసుకుంటోంది. జానపద సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. వీటిలో చిందు యక్షగానం, మెటల్ కిన్నెరా, లయబద్ధమైన రంజు సంగీత ప్రదర్శనలు ఉండేలా పర్యాటక శాఖ కార్యక్రమాలను రూపొందించింది.

అందగత్తెలకు గుర్తుండేలా..

యాదగిరిగుట్ట, పోచంపల్లిలో ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్



పోచంపల్లిలో చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, గుట్టలో సూచనలు చేస్తున్న హనుమంతరావు

యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయి అందగత్తెల పోటీదారులకు గుర్తుండేలా ఆతిథ్యం ఇచ్చేందుకు యాదగిరిగుట్ట దేవస్థానం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట దేవస్థానం ప్రొటోకాల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ప్రపంచ సుందరీమణుల పర్యటన నేపథ్యంలో అధికారులకు పలు సలహాలు చేసి మాట్లాడారు. ఈ నెల 15న సాయంత్రం 5 గంటలకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకునేందుకు మిస్‌వరల్డ్ పోటీదారులు వస్తున్నారని వివరించారు. యాదగిరిగుట్ట ఆధ్యాత్మిక క్షేత్రం ప్రపంచస్థాయి అందాలభామల సందర్శనతో అదే స్థాయిలో గుర్తింపు సాధించి టూరిజం స్పాట్‌గా నిలవనుందన్నారు. ఈవో సూచనల మేరకు పర్యటన రోజున సాయంత్రం బ్రేక్ దర్శనం, వెండి జోడు సేవలు రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రకటించారు. పర్యటన ముగిసిన వెంటనే యథావిధిగా కైంకర్యాలు కొనుగుతున్నట్లు వివరించారు. సమీక్షలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, యాదగిరిగుట్ట తహసీల్దార్ దేశ్యానాయక్, ఆర్‌ఐ శ్రీకాంత్, ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, సివిల్ సప్లయి ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు పాల్గొన్నారు.

పర్యటన సాగుతుందిలా...

ఈ నెల 15న సాయంత్రం 5 గంటలకు 7 గంటల వరకు అందాలభామల యాదగిరిక్షేత్ర పర్యటన...

- మిగతా 8వ పేజీలో...

రక్తనిధి కోసం తిప్పలు



రక్తదానం ప్రాణదానంతో సమానం అంటారు. చిన్న రక్తపు బొట్టు ప్రాణాన్ని నిలబెడుతుంది. ఏదైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్పత్రిలో చేరగానే అవసరమయ్యేది రక్తమే. దీంతో రోగి కుటుంబ సభ్యులు వెంటనే రక్తం కోసం ఉరుకులు పరుగులు తీయడం తరుచూ చూస్తుంటాం. కొంత కాలంగా జిల్లాలో బ్లడ్ బ్యాంక్ లేకపోవడంతో ఇక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అయితే జిల్లాలో బ్లడ్ బ్యాంక్ నిర్మాణానికి దాతలు సిద్ధంగా ఉన్నారని, కేవలం స్థలం కేటాయిస్తే సరిపోతుందని రెడ్‌క్రాస్ సంస్థ విజ్ఞప్తి చేస్తోంది. దీంతో జిల్లాయంత్రాంగం స్థలం కేటాయింపుపై కసరత్తు మొదలు పెట్టింది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుకు స్థలం కావాలని రెడ్‌క్రాస్ విజ్ఞప్తి
- భవన నిర్మాణానికి భువనగిరిలో 1500 నుంచి 2వేల గజాలు అవసరం
- రూ.2కోట్లతో బ్లడ్‌బ్యాంకు నిర్మాణానికి, సౌకర్యాలకు దాతల సిద్ధం
- రానున్న రోజుల్లో మెడికల్ హబ్‌గా..
- బ్లడ్‌బ్యాంక్, తలసేమియా వార్డుతో ఉమ్మడి వరంగల్, నల్లగొండతోపాటు కరీనంగర్, మేడ్చల్ జిల్లావాసులకు ప్రయోజనం

అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు, ఆపద సమయంలో రక్తం అవసరమవుతోంది. అయితే ఈ రక్తం మనిషి నుంచి తీసిన వెంటనే జబ్బుచేసిన, గాయపడిన రోగికి ఎక్కించే వీలుండదు. ప్రభుత్వ గుర్తింపు పొందిన రక్త నిధి(బ్లడ్‌బ్యాంకు)లోని ప్రయోగశాలలో పరీక్షించిన రక్తాన్ని మాత్రమే రోగులకు వినియోగించాలి. ఈ నేపథ్యంలో రక్తం ఆపదలో ఉన్న వ్యక్తులను కాపాడేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. హైదరాబాద్ నగరానికి అతి చేరువలో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాలో బ్లడ్‌బ్యాంకు లేకపోవడంతో జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాల వారు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా నుంచి జాతీయ రహదారులైన ఎన్‌హెచ్ 163 హైదరాబాద్-వరంగల్, ఎన్‌హెచ్ 65 హైదరాబాద్-విజయవాడ ఉన్నాయి. వీటితోపాటు ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు వెళ్లేందుకు లింకు రోడ్లు కూడా ఉన్నాయి. ఈ రహదారులపై నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్లనుంచి ప్రయాణించే వాహనదారులు తరుచుగా ప్రమాదాలకు గురవుతుంటారు. జిల్లాకేంద్రంతోపాటు ఎయిమ్స్, ఇతర ఆస్పత్రుల్లో అరకొరగా వైద్య వసతులు ఉండటంతో పాటు రక్తం అందుబాటులో లేకపోవడంతో గాయపడిన వారందర్నీ కూడా హైదరాబాద్‌కు తరలిస్తారు. అయితే రానున్న రోజుల్లో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి స్థాయి పెంచి..., సౌకర్యాలు కల్పించంలేదు. అదేవిధంగా ఎయిమ్స్ కూడా అన్ని రకాల వైద్యానికి సిద్ధమవుతోంది. మరోవైపు యాదగిరిగుట్టలో ప్రభుత్వ మెడికల్, ఆస్పత్రి నిర్మాణం కానుంది. ఎయిమ్స్‌లో 750 పడకల ఆస్పత్రి,యాదగిరిగుట్ట ఆస్పత్రిలో 100పడకలతోపాటు ఏరియా ఆస్పత్రులో 200 పడకలు, పీహెచ్‌సీల్లో అత్యవసర సేవలన్నీ కూడా అందుబాటులో రానున్నాయి. ఈ ప్రాంతం రానున్న రోజుల్లో మెడికల్ హబ్‌గా మారనుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో బ్లడ్‌బ్యాంకు అత్యవసరంగా మారింది. జిల్లాకేంద్రంలో బ్లడ్ బ్యాంకు నిర్మించాలని స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తున్నారు. బ్లడ్ బ్యాంకుకు స్థలం ఇస్తే రెడ్‌క్రాస్ సంస్థ దాతల సహకారంతో నిర్మించే అవకాశం ఉంది.

దాతల సహకారంతో వసతులు

భువనగిరి పట్టణంలో బ్లడ్ బ్యాంకు నిర్మిస్తే దాతల సహకారంతో అన్ని వసతులు కల్పించేందుకు రెడ్‌క్రాస్ సంస్థ సిద్ధంగా ఉంది. బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేస్తే రక్తాన్ని పరీక్షించేందుకు ల్యాబ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం సిబ్బంది, పరికరాలు, మిషన్లు, నాలుగు వాహనాలు, సాంకేతికపరమైన వసతులన్నీ కూడా రెడ్‌క్రాస్ దాతల సహకారంతో సమకూర్చనుంది. బ్లడ్‌బ్యాంక్ నిర్మాణంతోపాటు పరికరాలు, ఇతర వాటి కోసం దాదాపు రూ.4కోట్ల వరకు ఖర్చవుతాయి. భవనం నిర్మాణం కోసం దాతలు సిద్ధంగా ఉండగా, ఈ మేరకు దాతలు, ప్రభుత్వ సహాయంతో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు రెడ్‌క్రాస్ సంస్థ సిద్ధమవుతోంది. అయితే జిల్లా యంత్రాంగం స్థలం కేటాయించడమే తరువాయి. మరోవైపు జిల్లాకేంద్రంలో అనువైన స్థలాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్టు సమాచారం.

స్థలం కేటాయించండి... రూ.2కోట్లతో బ్లడ్ బ్యాంకు నిర్మిస్తాం..

యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో సామాజిక అవసరాల్లో భాగంగా బ్లడ్‌బ్యాంకుకోసం స్థలాన్ని కేటాయించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. భువనగిరి పట్టణంలో 1500 నుంచి 2వేల గజాల స్థలాన్ని రెడ్‌క్రాస్‌కు ఇవ్వాలని కోరుతున్నారు. రెడ్‌క్రాస్‌సంస్థ జిల్లాలో 2016 నుంచి పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా దాతల సహకారంతో రూ.2కోట్లతో బ్లడ్‌బ్యాంకుతోపాటు తలసేమియా రోగులకు సంబంధించిన..

- మిగతా 8వ పేజీలో...

ప్రాథమిక స్థాయిలో ఆశాలదే ప్రముఖపాత్ర

- డీఎంహెచ్‌వో ఎం.మనోహర్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మనోహర్

భువనగిరి (కలెక్టరేట్), మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రాథమికస్థాయిలో గర్భిణులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయడంలో ఆశా కార్యకర్తలదే ప్రముఖ పాత్ర అని డీఎంహెచ్‌వో ఎం.మనోహర్ అన్నారు. పీహెచ్‌సీ కేంద్రాల ఆశా నోడల్ ఆఫీసర్లు, ఫెసిలేటర్లతో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రాథమికస్థాయిలో ఆశాలదే ప్రముఖ పాత్ర అని, గర్భందాల్చిన నాటి నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగే వరకూ క్షేత్రస్థాయిలో సహకారం అందించాలన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పరిధిలో ప్రజలకు అందించే సేవలన్నింటినీ హెల్త్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు రక్తహీనతకు గురికాకుండా పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స చేయాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది ఆసుపత్రులకు వచ్చే రోగులకు వడదెబ్బపై అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శిల్పిని మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ప్రజలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చికిత్స చేయాలన్నారు. అకాల వర్షాలతో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ఎండ వేడిమితో వడదెబ్బ తగలకుండా రోగులకు అవగాహన కల్పించి అవసరమైన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డీఐవో రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో మిషన్ ఇంద్ర ధనుస్సు మే 21 నుంచి 28వరకు కొనసాగుతుందన్నారు. పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి గతంలో ఇమ్యునైజన్ చేయించుకోని వారికి తప్పనిసరిగా టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో ఒట్టెపు అంజయ్య, జిల్లా ఆశా నోడల్ ఆఫీసర్ దార సత్యవతి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపే లక్ష్యం

- విద్యార్థులకు 'యంగ్ ఇండియా' వేసవి శిక్షణ శిబిరాలు
- జిల్లాలో 50 పాఠశాలలు ఎంపిక
- రేపటి నుంచి శిక్షణ శిబిరాలు ప్రారంభం



మోత్కూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్గత సామర్థ్యాలు, సృజనాత్మకత, నైపుణ్యాల పెంపే లక్ష్యంగా విద్యాశాఖ సరికొత్త కార్యక్రమాల కు శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతోపాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల నైపుణ్యాలను పెంచేందుకు ఈ నెలలో ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో 'యంగ్ ఇండియా' వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనుంది.

జిల్లాలో 50 పాఠశాలల ఎంపిక

జిల్లాలో 'యంగ్ ఇండియా' వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, వెల్మజాల ఉన్నత పాఠశాలలతోపాటు మొత్తం 50 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో విద్యాశాఖ ఈ కార్యక్రమం చేపట్టింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో 15 రోజులపాటు రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు 3 గంటలపాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణ శిబిరాలు ఈ నెల 15న ప్రారంభమై 31న ముగుస్తాయి. 6నుంచి 9వ తరగతి విద్యార్థులకు శిక్షణ పొందడానికి అర్హులు. ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయుడు ఈ శిబిరాలను పర్యవేక్షిస్తారు.

శిక్షణనిచ్చే అంశాలు...

చదరంగం, క్యారమ్స్‌లాంటి ఇండోర్ గేమ్స్, యోగా, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథ్స్ బేసిక్స్, పిల్లల ఆసక్తికి అనుగుణంగా కుట్లు, అల్లికలు, బ్యూటీషియన్, సాంస్కృతిక కార్యకలాపాల్లో తర్ఫీదు, సామాజిక సేవ తదితర అంశాల్లో శిక్షణనిస్తారు. స్థానికంగా ఉన్న వనరుల ననుసరించి ఆయా అంశాలను ఎంపిక చేస్తారు.

ఒక్కో శిబిరంలో 100 మందికి అవకాశం

ఒక్కో శిబిరంలో 100 మంది విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉంటుంది. 50 మంది చేరితే రూ.25వేలు, వంద మంది చేరితే రూ.50వేలు నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించే పాఠశాలలకు ఇస్తుంది. విద్యార్థులకు శిక్షణనివ్వడానికి ట్రైనర్లను నియమించి వారికి గౌరవ వేతనం ఇస్తారు. శిక్షణకు వచ్చే విద్యార్థులకు అల్పాహారం కూడా అందిస్తారు.

యంగ్ ఇండియా లక్ష్యాలు

విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల పెంపు, స్వతహాగా ఆలోచించడం, సామూహికంగా పనులు చేయడం, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తారు. ధ్యాసనా ప్రక్రియల్లో పాల్గొనడం, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడం, ఉత్పాదకతపై అవగాహన లక్ష్యంగా శిబిరాలు నిర్వహించనున్నారు.

అన్ని రంగాల్లో రాణించాలనే..



విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం 'యంగ్ ఇండియా' వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నది. ఈ శిబిరాలు విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయి.

- తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంఈవో, మోత్కూరు

నాణ్యమైన బోధన అందించాలి

డీఈవో సత్యనారాయణ


వృత్యంతర శిక్షణపై అవగాహన కల్పిస్తున్న డీఈవో సత్యనారాయణ

భువనగిరి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకొని, పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించాలని డీఈవో సత్యనారాయణ అన్నారు. మంగళవారం భువనగిరిలోని రెండు కేంద్రాల్లో గణితం, ఆంగ్లం వృత్యంతర శిక్షణా తరగతులను ప్రారంభించి మాట్లాడారు. వృత్యంతర శిక్షణ ఉపాధ్యాయుల వృత్తిపరమైన నైపుణ్యాలకు దోహదపడుతుందన్నారు. రిసోర్స్ పర్సన్స్ ఇచ్చే సూచనలను ఉపాధ్యాయులు పరిగణలోకి తీసుకోవాలన్నారు. శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న బోధనా మెలకువలను, విషయ పరిజ్ఞానాన్ని తరగతి గదుల్లో ఉపయోగించాలన్నారు.

వృత్యంతర శిక్షణా తరగతులకు హాజరవడం గౌరవంగా స్వీకరించాలన్నారు. నేటి పరిస్థితుల్లో నేర్చుకొని బోధించడం తప్పనిసరి అవుతున్నదని ఉపాధ్యాయులందరూ గ్రహించాలన్నారు. డిజిటల్ తరగతులను నిర్వహించేలా ఆసక్తి పెంచుకోవాలన్నారు. తరగతులకు గైర్హాజరయ్యే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జె.శ్రీనివాసులు, జాని, అఫ్జల్, ఎం భాస్కర్, నర్సింహులు, రవికుమార్, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి గోపాల్


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ

భువనగిరి (కలెక్టరేట్), మే 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, పోలీసు శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదు తీసుకొని పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్త పరచాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయ అధికారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలీసెట్

జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాలు... 94శాతం హాజరు


పరీక్షా కేంద్రం నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

భువనగిరి టౌన్, యాదగిరిగుట్ట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాలకు మంగళవారం జిల్లాలో నిర్వహించిన పాలీసెట్-2025 ఎంట్రెన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. భువనగిరిలో 4, యాదగిరిగుట్టలో 2 మొత్తం ఆరు పరీక్షా కేంద్రాల్లో 1,754 మంది విద్యార్థులకు 1664 మంది (94.86 శాతం) హాజరు కాగా 90 మంది గైర్హాజరయ్యారు. అయితే 910 మంది బాలురకు 870మంది, 844 మంది బాలికలకు 794 మంది హాజరయ్యారు. పాలిసెట్ జిల్లా కన్వీనర్, యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వర్లు తదితర అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

‘భూదాన్‌పోచంపల్లి అనగానే మగువలు మెచ్చే పట్టుచీరలకు నిలయం. సిల్క్‌సిటీ ఆఫ్ పోచంపల్లిగా ప్రసిద్ధి. దేశంలోనే మొదటిసారిగా భూదానం జరగడంతో భూదాన్ గంగోత్రిగానూ ప్రపంచ ప్రసిద్ధి. ఈ అంశాలే పోచంపల్లిని ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఐక్యరాజ్యసమితి అనుబంధంగా పనిచేస్తున్న ప్రపంచ పర్యాటక సంస్థ(యూఎన్‌డబ్ల్యుటీవో) నిర్వహించిన ‘బెస్ట్ టూరిజం విలేజ్’ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచి విశ్వఖ్యాతి పొందింది. అదే కోవలో ప్రపంచ సుందరీమణుల రాకతో మరోసారి విశ్వవ్యాప్త దృష్టిని ఆకర్షిస్తోంది.”

- (ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

భూదాన్‌పోచంపల్లికి విశ్వఖ్యాతి!



- చేనేత వస్త్రాలకు పుట్టినిల్లు
- భూదాన ఉద్యమానికి నాంది పలికిన నేల
- ప్రపంచ పర్యాటక గ్రామంగా గుర్తింపు

భూదానోద్యమ స్ఫూర్తి, ఇక్కత్ పట్టు చీరల తయారీకి ప్రసిద్ధి చెంది, దేశ, విదేశీయుల మనసు దోచిన పల్లె భూదాన్‌పోచంపల్లి. పేదలకు భూమిని పంచిన ఆచార్య వినోబాభావే నడయాడిన నేల ఇది. గ్రామీణ జీవనశైలి, సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం ఈ గ్రామం. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటూ ఆహ్లాదపరుస్తోంది. ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తింపు పొందింది. రాష్ట్ర రాజధానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉండే భూదాన్ పోచంపల్లిని సందర్శించేందుకు ఈ నెల 15న ప్రపంచ సుందీరమణులు రానున్నారు.

ఘనమైన చరిత్ర

ఊరంటే చెట్టు, చేమ, మళ్లు, చెరువులు, చెలకలు, పాడి పశువులు, గుడి, బడి ఇలా వాటితో పెనవేసుకున్న మనుషులు. వీటన్నింటితో పాటు పోచంపల్లికి అత్యంత గుర్తింపు తెచ్చిన మరొకటి చేనేత. పడుగు, పేకలతో చేనేత టై అండ్ డై ఇక్కత్ పట్టు వస్త్రాల తయారీకి పుట్టిల్లు ఈ గ్రామం. దీంతో సిల్క్ సిటీ ఆఫ్ ఇండియాగా పేరొందింది. చేనేత వస్త్రాలకు ఆలవాలం కాకముందు గాజులు, పూసల తయారీకి ప్రసిద్ధి చెందినదిగా చెబుతుంటారు. అందుకే దీనికి ‘గాజుల పూసలపల్లి’గా పేరు. ఉచ్ఛరణలో రానురాను గాజులపోచంపల్లిగా అయ్యింది. భూదానోద్యమం మహోద్యమానికి అంకురార్పణ జరిగిన క్రమంలో భూదాన్‌పోచంపల్లిగా పేరొందింది.



వినోబాభావే స్ఫూర్తితో భూదానోద్యమం

మహాత్మాగాంధీ ప్రియశిష్యుడైన ఆచార్య వినోబాభావే 1951 ఏప్రిల్ 15న హైదరాబాద్‌లోని శివరాంపల్లిలో నిర్వహించే సర్వోదయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఆ సమయంలో నల్లగొండ జిల్లాలో జరుగుతున్న కల్లోల పరిస్థితులను తెలుసుకొని పరిష్కారమార్గాన్ని వెతకడానికి పాదయాత్రగా పోచంపల్లికి చేరుకున్నారు. ఏప్రిల్ 18న దళితులతో సమావేశమయ్యారు. తమకు కొంత భూమిని ఇప్పిస్తే సాగుచేసుకుని జీవిస్తామని గోడును వెల్లబోసుకున్నారు. దీంతో వినోబాభావే స్పందిస్తూ మీలో ఎవరైనా భూమి దానం చేసేవారున్నారా? అని అడగడంతో అక్కడే ఉన్న వెదిరె రామచంద్రారెడ్డి లేచి తన తండ్రి జ్ఞాపకార్థం 100 ఎకరాల భూమి దానం చేస్తానని ప్రకటించారు. అక్కడికక్కడే దానపత్రం నిండు సభలో వినోబాభావేకు అందజేశారు. దానరూపేణ ఇచ్చిన భూమిని వెంటనే పేదలకు పంచి భూదానోద్యమానికి బీజం వేశారు. వినోబాజీ పాదయాత్ర కాస్త ‘భూదానయాత్ర’గా మారింది. దేశవ్యాప్తంగా 44లక్షల ఎకరాల భూమిని సేకరించి పేదలకు పంచారు.

అరబ్ దేశాలకు రుమాళ్లు

అసఫ్‌జాహీల పాలన కాలం నాటికే చేనేత మగ్గాల సవ్వడిని వింటూ ఉంది పోచంపల్లి. అద్భుతమైన వస్త్రనేత కళాకారులకు పెద్దపీట వేసింది. 1910 నాటికే ఇక్కడ చిటికి పరిశ్రమ ఏర్పాటైంది. ఇరవై నెంబరు నూలుతో ‘తేలియా రుమాళ్లు’ నేసేవారు. వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిపోయే అరబ్బులు వీటిని ఇష్టపడి కొనుగోలు చేసేవారు. ఆ తరువాత తేలియా రుమాళ్లను అరబ్ దేశాలకు ఎగుమతి చేయడం ఆరంభించారు.

పట్టుకు పెట్టింది పేరు

తేలియా రుమాళ్ల తర్వాత కాటన్ వస్త్రాల తయారీ ఇక్కడ సాగింది. ఈ గ్రామానికి కర్నాటి అనంతరాములు, తడక పెద్ద యాదగిరి అనే చేనేత కళాకారులు 60 నెంబరు నూలుతో పడుగు, పేకలతో సహజ రంగుల్లో చీరలను నేశారు. 1956లో పోచంపల్లిని సందర్శించిన ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు ప్రెసిడెంట్ కమలాబాయి ఛటోపాధ్యాయ చిన్న తరహాపరిశ్రమ డైరెక్టర్ దయారాం కాటన్ మాదిరిగానే పట్టుచీరలను తయారుచేయమని వారిని కోరారు. వారి కోరిక మేరకు అనంత రాములు, పెద్ద యాదగిరి ఇద్దరూ బనారస్ వెళ్లి అక్కడ ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నారు. అనంతరం కర్నాటి అనంతరాములుతో పాటు భిక్షపతి, కర్నాటి వాసుదేవ్ తమిళనాడు రాష్ట్రంలోని కుంభకోణం వెళ్లి రంగుల అద్దకంలో శిక్షణ పొందారు. ఆ తర్వాత పోచంపల్లికి వచ్చి మొట్టమొదటిసారిగా 1958లో కర్నాటి అనంతరాములు మగ్గంపై పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ చీరను నేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే చేనేత సంప్రదాయక వృత్తి నైపుణ్యాలను చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిన అవసరాన్ని డబ్ల్యుటీవో గుర్తించింది. 1999లో జియోగ్రాఫికల్ ఇంటికేషన్ ఆఫ్ గూడ్స్ చట్టం చేశారు. దీని ద్వారా ఒక ప్రాంతంలో తయారైన వస్తువులకు రక్షణ కల్పించవచ్చు. ట్రిప్స్‌లోని ఆర్టికల్ 22 నుంచి 24 వరకు వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన అంశాలుంటాయి. వాటి ఆధారంతో వస్త్రాల తయారీకి విశిష్టతను గుర్తించిన ప్రభుత్వం 2003లో పేటెంట్ హక్కును (జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ) కల్పించింది. దీంతో చేనేత ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి కావడంతో చేనేత కార్మికుల ప్రతిభకు విశ్వవ్యాప్త గుర్తింపు లభించింది.

సినిమా షూటింగ్, షార్ట్ ఫిల్మ్స్‌కు కేరాఫ్

ఎటుచూసినా పచ్చని పంట పొలాలు. మూసీ పరివాహకంలోని వరి చేలు, చెరువులు, గుట్టలతో అందమైన లొకేషన్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో కోనసీమను తలపించే ఈ ప్రాంతంలో సినిమా షూటింగ్‌లకు, షార్ట్ ఫిలింలకు కేరాఫ్ అడ్రస్‌గా పోచంపల్లి మారింది. షూటింగ్‌లకు మొదట క్లాప్ కొట్టి యాక్షన్ చెప్పింది ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనగల్. 1986లో సుస్మాన్ సినిమా షూటింగ్ కోసం పోచంపల్లికి ఆయన హీరోయిన్ షబనా ఆజ్మీతో సహా ఆ సినిమా యూనిట్ మొత్తం పోచంపల్లిలోనే నెలరోజుకు పైగా బసచేశారు. ప్రముఖ నటుడు ఓంపురి కూడా ఇక్కడికి వచ్చి చేనేత పని నేర్చుకున్నారు. అలా సుస్మాన్‌తో మొదలై నేటి వరకు ఎన్నో తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాలు, పలు సీరియల్స్ డాక్యుమెంటరీల షూటింగ్‌లు నేటికీ నిత్యం జరుగుతున్నాయి.

ప్రపంచ సుందరీమణుల సందర్శనతో ‘పోచంపల్లి ఇక్కత్’కు మరింత ప్రాచుర్యం



పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాలకు ఇప్పటికే ఖండాంతర ఖ్యాతి ఉంది. కాగా, ఈనెల 15న పోచంపల్లికి ప్రపంచ సుందరీమణులు సందర్శించి చేనేత థీమ్‌పై విస్తృత ప్రచారం చేయనున్నారు. దీంతో దేశ విదేశాల్లో పోచంపల్లి ఇక్కత్‌కు బ్రాండ్ ఇమేజ్ మరింత పెరగనున్నది.

- తడక రమేష్, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ ట్రస్ట్ చైర్మన్ తడక రమేష్

సుందరీమణుల రాకతో మరింత ప్రాచుర్యం



భూదాన్‌పోచంపల్లికి ఈనెల 15న ప్రపంచ సుందరీమణులు వస్తున్న నేపథ్యంలో పోచంపల్లి ఖ్యాతి ప్రపంచదేశాలకు ప్రాచుర్యం పొందనున్నది. ఇక్కడిఇక్కత్ పట్టు చీరలకు మంచి గుర్తింపు లభించనుంది. ఇప్పటికే చేనేత పరిశ్రమతో పాటు భూదానోద్యమానికి నాంది పిలికి పేరొందిన పోచంపల్లి ప్రపంచ సుందరీ మణుల సందర్శనతో మరింత పేరు లభించనుంది.

- మెరుగు శశికళ, జిల్లా చేనేత నాయకురాలు

పర్యాటకానికి రంగులు అద్దిన ఊరు

వినోబాభావే సందర్శనతో భూదానోద్యమానికి నాంది పలికింది పోచంపల్లి. దీంతో ఈ ఊరికి చారిత్రక ప్రాశస్త్యాన్ని కల్పించింది. చేనేత, భూదానోద్యమం ద్వారా పోచంపల్లి ఓ పర్యాటక పల్లెగా మారింది. చేనేత మార్కెటింగ్ కోసం వచ్చిపోయే వ్యాపారులు, కొనుగోలుదారులతో పాటు ఆచార్య వినోబాభావే నడయాడిన నేల, ఆయన కూర్చున్న జువ్విచెట్టు, ఆయన బసచేసిన చోటు వినోబా మందిరంగా నిలిచింది. పూర్వం దొరల కాలంలో సంతాన ప్రాప్తి కోసం ఇక్కడ నిర్మించిన 101 దర్వాజల భవనాన్ని సందర్శించేందుకు ఎంతోమంది పర్యాటకులు వస్తుంటారు. 2007లో రూ.3.75 కోట్లతో ఇక్కడ గ్రామీణ పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. రూరల్ టూరిజం సెంటర్ నేడు విదేశీయులకు అధ్యయన కేంద్రంగా మారింది. గతంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోచంపల్లి టూరిజం పార్క్‌లో మేళాలను నిర్వహించారు. ఇందులో చేనేత వస్త్రాల ప్రదర్శన, హ్యాండీక్రాఫ్ట్, గ్రామీణ వంటకాల రుచులు, గ్రామీణ కళల్లో భాగంగా గంగిరెద్దుల ఆట, డప్పు కళాకారుల ఆటపాట, ఒగ్గు కళారూపాలను ప్రదర్శించి అలరించారు. భూదాన్‌పోచంపల్లిలోని చేనేత పట్టు చీరలకు ప్రాచుర్యం కల్పించేందుకు



పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు స్థానిక టూరిజం పార్క్‌లో 2008లో ఫ్యాషన్ షోను ప్రదర్శించారు. ప్రముఖ నటి శోభనతో పాటు పలువురు మోడల్స్ పోచంల్లి ఇక్కత్ వస్త్రాలతో ఫ్యాషన్ షో నిర్వహించి పర్యాటకులను ఆకట్టుకున్నారు.

విషజ్వరంతో విద్యార్థిని మృతి





సహస్ర కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి, సహస్ర(ఫైల్‌ఫొటో)

యాదగిరిగుట్ట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలో విద్యార్థిని మృతితో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సౌన్నాయిల రమేష్ కుమార్తె సహస్ర(13) ఈ నెల 11న విపరీతమైన జ్వరానికి గురైంది. దీంతో హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. రెండు రోజులు చికిత్సపొందుతూ ఈ నెల 12న మృతి చెందింది. ఇప్పటివరకు సహస్రకు ఎలాంటి జబ్బులు లేకపోవడంతో గ్రామస్థులు ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థుల్లో కొందరు విషజ్వరంతో బాధపడుతున్న వారు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అయితే విషజ్వరాలతో గ్రామస్థులు బాధపడుతున్నా వైద్యులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


సహస్ర కుటుంబాన్ని పరామర్శించిన మహేందర్‌రెడ్డి

పెద్దకందుకూర్‌లో సహస్ర మృతదేహంపై డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను అగిడి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఇంటింటి సర్వే చేయిస్తున్నాం : మెడికల్ ఆఫీసర్ పావని

పెద్దకందుకూర్ గ్రామంలో సిబ్బందితో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని మెడికల్‌ఆఫీసర్ పావని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య విషయంలో ఎప్పటికప్పుడు వారికి సలహాలు సూచనలు చేస్తున్నామన్నారు. మృతి చెందిన విద్యార్థి సహస్ర పీహెచ్‌సీకి రాలేదని, గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

బత్తాయి చెట్లు దగ్ధం



చెట్లు కాలిపోయిన ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

పెద్దఅడిశర్లపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల గ్రామ శివారులో మంగళవారం బత్తాయి తోట దగ్ధమైంది. బాధిత రైతుల వివరాల ప్రకారం పీఏపల్లి గ్రామానికి చెందిన నారాయణ శ్రీనివాస్ 30 చెట్లు, ఏరుకొండ లింగయ్యకు చెందిన 30, గణపురం సంతోష్‌కు చెందిన 5 చెట్లు సమీపంలోని రైతులు వరి కొయ్యలు కాల్చడంతో ఎండకు పక్కనే ఉన్న బత్తాయి చెట్లకు అంటుకున్నాయి. దీంతో చెట్లు దగ్ధమైనట్లు వారు తెలిపారు. మిగతా చెట్లకు వ్యాపించకుండా అప్రమత్తమైన రైతులు వెంటనే మంటలు ఆర్పివేశారు. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఘటన స్థలాన్ని సందర్శించి, పంచనామా నిర్వహించారు. ఎనిమిదేళ్లుగా చెట్లను కాపాడుకుంటూ వస్తున్నామని, చెట్లు కాలిపోవడంతో నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వీధికుక్కల దాడిలో లేగ దూడ మృతి

ఆలేరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : వీధికుక్కల దాడిలో లేగదూడె మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో సోమరాజు బావిగూడెం వద్ద జరిగింది. స్థానిక రైతు గంగధారి అంజయ్య తన వ్యవసాయ బావి వద్ద పశువుల కొట్టంలో పాడి ఆవులు, గేదెలు, లేగ దూడెలను సోమవారం రాత్రి కట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం కొన్ని వీధికుక్కలు లేగ దూడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో లేగ దూడ అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామంలో అధికంగా ఉన్న వీధికుక్కలను తక్షణమే నివారించే చర్యలు చేపట్టాలని రైతులు అధికారులను కోరారు.

ఒక్కో కేసుకు ఖరీదు

- పోలీసుల డిమాండ్లతో భయం
- సూర్యాపేట ఘటనతో సర్వత్రా చర్చనీయాంశం

మోత్కూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : నిజాయితీకి మారుపేరుగా ఉండాల్సిన పోలీసు శాఖలో కొందరు అవినీతి మరకలంటించుకుంటున్నారు. అక్రమార్కులతో పోలీసులే లాలూచి పడి అక్రమార్జనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నేరారోపణ ఎదుర్కొంటున్నవారు సైతం పోలీసుల అత్యాశకు బెదిరి ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఏసీబీ చిక్కుతున్నా వారి తీరులో మార్పు రావడం లేదు. తాజాగా సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకుల నుంచి రూ.16 లక్షలు డిమాండ్ చేసిన కేసులో డీఎస్పీ పార్థసారథి, సీఐ వీరరాఘవులు ఏసీబీకి పట్టుబట్టారు. దీంతో పోలీసుల తీరు చర్చనీయాంశమైంది. అక్రమ వసూళ్లలో పోలీసులు తమ తీరును మార్చుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు ఈ ఏడాది ఏసీబీకి చిక్కారు. జనవరి 12న తిరుమలగిరి పోలీసులు వాహనాల తనిఖీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. విచారణలో సిద్దిపేట జిల్లా రాయికల్ మండలం వడ్డెపల్లి గ్రామానికి చెందిన రైస్‌మిల్ వ్యాపారి చంద్రశేఖర్‌గా పేరు చెప్పారు. తిరుమలగిరి ఎస్ఐ సురేష్ రైస్‌మిల్ వ్యాపారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కేసు నుంచి తప్పించడానికి రూ.3లక్షల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసి రూ.లక్షా 40వేలకు డీల్ కుదుర్చుకున్నాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించి ఎస్ఐని, కానిస్టేబుల్‌ను పట్టించాడు. దీంతో వారు ఎస్ఐ, కానిస్టేబుల్‌ను కస్టడీలోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఆలేరు రూరల్: ఆలేరు నియోజకవర్గంలో గుండాల పోలీస్‌స్టేషన్ మినహాయించి మిగతా పోలీస్‌స్టేషన్లలో రెండేళ్లుగా ఏసీబీ దాడులు జరుగలేదు. 2020లో అప్పటి గుండాల ఎస్ఐ చందర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. రేషన్ బియ్యం కేసులో పట్టుబడిన వ్యాన్‌ను విడిపించేందు కోసం బాధితుడి నుంచి రూ.50వేలు లంచం అడగగా బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ప్రస్తుతం ఆయన వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే కొన్ని స్టేషన్లలో మాములు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం కొందరిని నియమించినట్లు సమాచారం.



తిరుమలగిరిలో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు(ఫైల్‌ఫొటో)

● అక్రమార్కులకు వత్తాసు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లలో ప్రతీ పనికి రేటు నిర్ణయిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ఎస్ఐలు అవినీతి సంపాదనకు అలవాటు పడి అక్రమాలకు తెరలేపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అక్రమార్జన కోసం రేషన్‌బియ్యం, ఇసుకఅక్రమ రవాణాకు సహకరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. 2024 అక్టోబరు 23న ఓ కేసులో రూ.10వేలు లంచం తీసుకుంటూ చింతలపాలెం ఎస్ఐ అంతిరెడ్డి ఏసీబీకి పట్టుబడ్డారు.అయినా ఇతరుల్లో మార్పురాలేదు.ఒక్కో కేసుకు రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు ఎస్ఐలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● హుజూర్‌నగర్ ప్రాంతంలో ఓ కేసులో బాధితురాలిని రాజీకి కుదుర్చిన ఎస్ఐ ఉదంతం బాధిత మహిళ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కాళ్లపై పడి తెలపడంతో అంతా నివ్వెరపోయారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్‌ను మరికొంతమంది అదేరంగంలోని వారు నమ్మించి మోసగించడంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ కేసులో పోలీసులకు రూ.10 లక్షల వరకు ముట్టినట్లు ఆరోపణలు వచ్చాయి.నిందితులపై కేసులు పెట్టకుండా ఫిర్యాదుదారురాలిని మోసం చేసిన అధికారులు చివరికి బాధితురాలికి రూ.6 లక్షలు ఇప్పించి కేసు రాజీ చేసినట్లు సమాచారం. ఒక్కటి కాదు, రెండు కాదు, వందల కేసుల్లో పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమార్కులకు అండగా ఉంటూ తప్పుడు కేసులు బనాయిస్తు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పరిచయం పెంచుకుని నకిలీ బంగారంతో మోసం

మేళ్లచెర్వు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పరిచయం పెంచుకుని నకిలీ బంగారం విక్రయించిన ఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రంలో జరిగింది. బాధితులు, ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం నెల రోజుల క్రితం పావురాలు, కౌజుపిట్టలు పట్టే ముగ్గురు మేళ్లచెర్వు మండలకేంద్రానికి చెందిన శంభిరెడ్డికి పరిచమయ్యారు. తాము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన వాళ్లమని పిట్టలు పట్టుకొని జీవనం సాగిస్తామని, తక్కువ ధరకు అందిస్తామని తెలిపి ఫోన్‌నెంబర్ తీసుకొని ఒకటి, రెండుసార్లు కౌజు పిట్టలను అందించి పరిచయం పెంచుకున్నారు. 20 రోజుల క్రితం తమ సమీప బంధువు ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా అతడికి వ్యవసాయ పొలంలో భారీగా బంగారం దొరికిందని, కావాల్సిన వారికి తక్కువ ధరకు అందిస్తామని పదేపదే శంభిరెడ్డికి ఫోన్ చేశారు. 15 రోజుల కిందట సదరు వ్యక్తుల ఫోన్‌కు స్పందించిన శంభిరెడ్డి అనంతపురం జిల్లా వెళ్లగా ఆయనకు శాంపిల్‌గా కొంత బంగారం ఉచితంగా అందజేశారు. ఆ బంగారాన్ని ఆయన మేళ్లచెర్వుకు తీసుకువచ్చి పరీక్షించగా మేలిమి బంగారం అని తేలిందని చెప్పారన్నారు. గత వారం రోజుల కిందట మరోసారి అనంతపురం జిల్లాకు వెళ్లి రూ.3 లక్షలతో బంగారం కొనుగోలు చేసి, దానిని స్థానికంగా తీసుకువచ్చి పరిశీలించినట్లు శంభిరెడ్డి తెలిపారు. నకిలీ బంగారం అని తేలటంతో తాను మోసపోయానని గ్రహించి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శంభిరెడ్డి తెలిపారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పరమేష్ తెలిపారు.



శంభిరెడ్డి కొనుగోలు చేసిన నకిలీ బంగారం గొలుసు

తక్కువ ధరకు కొని ఐకేపీ కేంద్రాల్లో విక్రయించి

- ఒకరు సస్పెన్షన్, ముగ్గురు వ్యాపారులపై కేసు నమోదు

రాజాపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు రైతుల ఉంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రలో దళారులు విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని దూది వెంకటాపూర్ కొనుగోలు కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేశారు. రెవెన్యూ, వ్యవసాయ, సహకార, పౌరసరఫరాల శాఖ అధికారులు మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులు సన్న, చిన్నకారు రైతుల నుంచి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఐకేపీ కేంద్రానికి తరలించి విక్రయాలు జరుపుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో దీనిపై అధికారులు విచారణ నిర్వహించారు. విక్రయిస్తున్నది వాస్తవమేనని రైతులు అధికారులకు వివరించారు. గ్రామానికి చెందిన వ్యాపారులైన నక్కిర్తి కనకరత్నం, నక్కిర్తి లక్ష్మి, వస్పరి మహేశ్‌లపై కేసు నమోదు చేసి 400 క్వింటాళ్ల ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏఈవోను సస్పెండ్ చేస్తూ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిని విధుల నుంచి తొలగించారు. అక్రమంగా కొనుగోలు కేంద్రాల్లో వ్యాపారులు ధాన్యం విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ అనిత, వ్యవసాయాధికారి పద్మజ రైతులకు సూచించారు.



దూదివెంకటాపూర్ కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న వివిధ శాఖల అధికారులు

గంజాయి స్వాధీనం

భువనగిరి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో మంగళవారం గంజాయి విక్రయిస్తున్న స్థానికుడైన ఎండీ ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి తెచ్చిన గంజాయిని బస్టాండ్‌లో విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో నిందితుడిని పట్టుకొని ఆయన వద్ద నుంచి 0.138 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఆవుల పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న 16 ఆవులను మంగళవారం స్వాధీనం చేసుకుని హైదరాబాద్ జియాగూడలోని గోశాలకు అప్పగించినట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. వరంగల్ వైపు నుంచి హైదరాబాద్‌కు ఆవులను తీసుకెళ్తున్న ట్రక్కును తనిఖీ చేయగా ఆవుల అక్రమ రవాణా వెలుగుచూసిందన్నారు. ఈ మేరకు నిందితుడు మరిశెట్టి సత్తయ్యను అరెస్ట్ చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వివాహిత మిస్సింగ్ కేసు

యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన ధీరావత్ బాబ్లి కుటుంబసభ్యులతో కలిసి దంత వైద్యశాలకు వెళ్లేందుకు సోమవారం భువనగిరి బస్టాండ్‌కు వచ్చింది. బస్సు దిగిన అనంతరం కుమారుడితో కలిసి మూత్రవిసర్జనకు వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బస్టాండ్ పరిసరాలు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

చిలుకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మూడు పాడిగేదెలు మృతి చెందాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామంలో మంగళవారం జరిగింది. బాధిత రైతులు గన్నా వెంకటేశ్వర్లు, గన్నా సత్యనారాయణ, గోపిదేశి ముత్తయ్యలు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే మేత కోసం పశువులను పొలాలకు వదలగా, గ్రామ పరిధిలోని సబ్బుల ఫ్యాక్టరీ గోదాం వెనుక గల పొలాల్లో విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. వీటి విలువ రూ.2 లక్షలకుపైనే ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

తుక్కాపురంలో..

భువనగిరి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపురంలో మంగళవారం జరిగింది. రూరల్ సీఐ చంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం రాసాల రమేష్ గేదెలు మేత మేస్తూ హర్షవర్ధన్ పొలంలోకి వెళ్లాయి. హర్షవర్ధన్ తన పొలం చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. రమేష్‌పాడి గేదె ఆ ఫెన్సింగ్‌కు ఉన్న తీగలకు తగిలి మృతి చెందింది. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఫీజులు నియంత్రణలో ఉండాలి

ఆంధ్రజ్యోతి జన వాక్యం

డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల మాదిరిగానే అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో కూడా ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనుంది. ముఖ్యంగా ఫీజుల నియంత్రణపై ముసాయిదా చట్టం సిద్ధం చేసింది. దీనిపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఫీజుల నియంత్రణ ముసాయిదా చట్టంతో మేలు జరుగుతుందని, ముసాయిదా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. ఫీజులు తక్కువ ఉంటే విద్యార్థులకు మేలు జరుగుతుందని వారు పేర్కొన్నారు.

• ఆంధ్రజ్యోతి- సూర్యాపేటటౌన్

ముసాయిదా చట్టంతో మేలు



రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీకళాశాలల్లో మాదిరిగా ఇంటర్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణ ముసాయిదా చట్టం అమలు చేస్తే ఎంతో మందికి మేలు జరుగుతుంది. పేద విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. విద్యారంగంలో అనేక సంస్కరణలు జరిగే అవకాశం ఉంటుంది. విద్యారంగంలో కార్పొరేట్ వ్యవస్థ ఆగడాలను అరికట్టేలా చూడాలి. అనుమతులు లేని కళాశాలలు, పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పేద విద్యార్థులకు కళాశాలల్లో కొన్ని సీట్లు కేటాయించాలి.

• నిద్ర సంపత్‌నాయుడు, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు

ఫీజులు తక్కువగా ఉండాలి



ప్రైవేట్ కళాశాలల్లో చదవాలంటే అధిక ఫీజులతో ఇబ్బందిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. పేదలకు కళాశాలల్లో ఉచిత సీట్లకు పెద్దపీట వేయాలి. విద్యాహక్కు చట్టం అమలులో లేక ఇబ్బంది ఎదురవుతోంది. అమ్మానాన్న కలలను సాకారం చేయలేక అనేక మంది విద్యార్థులు ఫీజుల భారంతో విద్యకు దూరమవుతున్నారు.

• సూరారపు ప్రేమ్‌కుమార్,ఇంటర్ విద్యార్థి సూర్యాపేట

చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. పిల్లలను చదివించాలంటే ఫీజులు భయంగా ఉంది. అధిక ఫీజులతో చదువులు చదివించలేక పోతున్నాం. గతంలో ఇలాంటి పేరెంట్స్, టీచర్స్ కమిటీలు ఉన్నా అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం తీసుకొస్తున్న ఫీజు నియంత్రణ ముసాయిదా చట్టం మాలాంటి నిరుపేదలకు వరంగా ఉంటుంది.

• చిప్పలపల్లి వెంకటయ్య, సూర్యాపేట

కమిటీలో విద్యార్థి సంఘాలకు అవకాశం కల్పించాలి



పేరెంట్స్ టీచర్స్ కమిటీలో విద్యార్థి సంఘాలకు అవకాశం కల్పించాలి. 10మందితో కూడిన పేరెంట్స్ టీచర్స్ కమిటీలో విద్యార్థి సంఘాలకు అవకాశం ఉంటే చట్టం అమలు పటిష్ట అమలుకు అవకాశం ఉంటుంది. ఇందులో నలుగురు పేరెంట్స్, ముగ్గురు టీచర్స్ ఒకరు కళాశాల యాజమాన్యంతో పాటు ఇద్దరు విద్యార్థి సంఘం నాయకులు ఉండాలి. కార్పొరేట్ కళాశాల ఆగడాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలి.

• వెన్నెల, విద్యార్థి సంఘం నాయకురాలు

నాగవల్లీ దళార్చనలు



క్షేత్రపాలకుడికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు.

అలసి సొలసి..



ఎండ తీవ్రత అధికమవడంతో పశు పక్ష్యాదులు ఆపసోపాలు పడుతున్నాయి. ఎండ వేడిమికి తాళలేని కొన్ని వానరాలు(కోతులు) మంగళవారం ఇలా తలదాచుకున్నాయి. యాదగిరిగుట్టలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రొటోకాల్ కార్యాలయం పక్కన గోడకు తీర్చిదిదిన గజేంద్రుల ప్రతిమల మధ్య ఉన్న రథం నీడన సేదతీరాయి.

• యాదగిరిగుట్ట, ఆంధ్రజ్యోతి.

విత్తన పంపిణీకి సమాయత్తం





- టీజీ సీడ్స్ ఆధ్వర్యంలో నేటినుంచి పంపిణీకి ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో 104 కేంద్రాల ద్వారా పంపిణీ
- సహకార సొసైటీలు, ఏఆర్ఎస్‌కేలు, డీసీఎంఎస్‌ల ద్వారా పంపిణీ
- 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాలు

వరి	4,300 క్వింటాళ్లు
జీలుగ,	6,000 క్వింటాళ్లు
జనుము	690 క్వింటాళ్లు
కంది	20 క్వింటాళ్లు
వరి సన్నరకం	3500 క్వింటాళ్లు
వరి దొడ్డు రకం	800 క్వింటాళ్లు
వరి బీపీటీ	5204 క్వింటాళ్లు
జేజీఎల్	27356 క్వింటాళ్లు

జిల్లా వారీగా కేటాయించిన విత్తనాలు

నల్లగొండ జిల్లాకు	4120 క్వింటాళ్లు
యాదాద్రి జిల్లాకు	1070 క్వింటాళ్లు
సూర్యాపేట జిల్లాకు	1500 క్వింటాళ్లు

వానాకాలం సాగు కోసం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(టీజీ సీడ్స్) విత్తనాలు అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని 104 కేంద్రాల ద్వారా ఈ నెల 15 నుంచి విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. 73 పీఏసీఎస్ కేంద్రాలు, 24 ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ఐదు డీసీఎంఎస్ కేంద్రాలు, ఒక ఎఫ్‌పీవో కేంద్రం, టీజీ సీడ్స్ కార్యాలయం ద్వారా రైతులకు విత్తనాలు సరఫరా చేయనుంది.

- ఆంధ్రజ్యోతి - నిడమనూరు

పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము విత్తనాలు 50శాతం సబ్సిడీపై అందిస్తుండగా, వరి, అపరాలకు మాత్రం సబ్సిడీ లేదు. కానీ టీజీ సీడ్స్ కార్యాలయం సొంత విక్రయ కేంద్రాల్లో రైతులు నేరుగా విత్తనాలు కొనుగోలు చేస్తే ఆరు శాతం వరకు తగ్గింపు ఉంటుంది. రైతులంగా కలిసి రెండు టన్నుల విత్తనాలు కొనుగోలు చేస్తే ఆరు శాతం డిస్కౌంట్‌తో పాటు ఎలాంటి రవాణా ఖర్చులు లేకుండా నేరుగా ఆయా గ్రామాలకు పంపించనున్నారు. యాసంగి సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు. వానాకాలం సీజన్‌లో అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. వివిధ రకాలైన మేలు రకం వరి విత్తనాలతో పాటు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, కంది విత్తనాలు కూడా అందుబాటులో ఉంచింది. రైతుల అవసరాల మేరకు పెసర, మినుము విత్తనాలు కూడా తెప్పించేందుకు చర్యలు తీసుకుంది. వరి విత్తనాలు బీపీటీ 5204, జేజీఎల్ 27356 తదితర రకాల విత్తనాలు కిలోకు రూ.45.50 ఉంది. 25 కిలోల సంచులు రూ.1137.50లకు లభిస్తున్నాయి. ఆర్ఎన్నార్ 15048 రకం వరి విత్తనాలు కిలో రూ.46.60 ఉంది, ఇవి 15కిలోల సంచుల్లో విక్రయిస్తున్నారు. దొడ్డు రకం వరి విత్తనాలు ఎంటీయూ1010, కేఎన్ఎం 118 రకం ఉన్నాయి. జీలుగ విత్తనాలు కిలో రూ.142.50, జనుము కిలో రూ.125.50లకు విక్రయిస్తున్నారు. వీటికి 50 శాతం సబ్సిడీ ఉంది. జీలుగ 30 కిలోలు, జనుము 40కిలోల సంచుల్లో దొరుకుతున్నాయి. అదే విధంగా కంది విత్తనాలు కిలో రూ.120 కాగా నాలుగు కిలోల సంచుల్లో అందుబాటులో ఉన్నాయి.

వానాకాలం సాగుకు సమాయత్తం

వీటిని ఉమ్మడి జిల్లాలోని ఆయా పంపిణీ కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించనున్నారు. వీటితో పాటు పెసర, మినుములు కూడా తెప్పించేందుకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో లక్ష క్వింటాళ్ల వరకు సేకరించినందున, విత్తనాలకు ఎలాంటి కొరత ఉండదని, రైతుల అవసరం మేరకు తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

వానాకాలం సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. దుక్కులు కూడా దున్నుతున్నారు. సాగుకు విత్తన ఎంపికే ప్రధానం. మేలురకం విత్తనాలతో సాగు చేస్తేనే అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించి, నాణ్యమైన విత్తనాలతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు అధికారుల సూచిస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నాం



వానాకాలం సీజన్ సాగు కోసం ఉమ్మడి జిల్లాలోని రైతాంగానికి అవసరమైన విత్తనాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈమేరకు ఆయా జిల్లాల్లోని పంపిణీ కేంద్రాలకు విత్తనాలు సరఫరా చేయడం జరిగింది. నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడమే విత్తనాభివృద్ధి సంస్థ ముఖ్య లక్ష్యం. రైతుల మేలు కోసం సంస్థ అందిస్తున్న విత్తన డిస్కౌంట్ పద్ధతిని సద్వినియోగం చేసుకోవాలి.

- టి. వినయ్, రీజనల్ మేనేజర్, టీజీ సీడ్స్


మేలురకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



పంటలు సాగు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా మేలురకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. నాణ్యమైన విత్తనాలతో పంటలు సాగు చేస్తేనే అధిక దిగుబడులు పొందగలుగుతారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఆకర్షణీయమైన ప్యాకింగులు చూసి మోసపోవద్దు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలి.

- విజయచంద్ర, ఏఈవో, నిడమనూరు

వానాకాలం సాగుపై ఆశలు



యాసంగి సీజన్ ముగియడంతో వానాకాలం సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకుని సేద్యానికి సిద్ధమవుతున్నాం. ప్రతి సీజన్‌లో కొందరు రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోవాల్సి వస్తుంది. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి ప్రవేశించకుండా అధికారులు చూడాలి. విత్తనాల ఎంపికపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి. రైతులకు అవసరమైన మేలురకం విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

- చింతకుంట్ల మల్లారెడ్డి, రైతు, బొక్కమంతలపహాడ్.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

• టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి • రూ.34 కోట్లు విడుదల చేయాలని వినతి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, మునుగోడు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు రూ.34 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులతో హైదరాబాద్‌లోని టీజీ ఎస్పీడీసీఎల్ రాష్ట్ర కార్యాలయంలో సీఎండీ ముషారఫ్‌ను కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వివరించారు. మునిసిపాలిటీలు, గ్రామాల్లో నెలకొన్న లో-ఓల్టేజీ సమస్య, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించాలని కోరారు. లూజ్ లైన్లు, నివాస గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించి ప్రమాదాలను నివారించాలని కోరారు. వెనుకబడిన మునుగోడును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని అన్ని రకాల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, వ్యవసాయాధారిత ప్రాంతమైనందున రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ శాఖలో విధుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అవినీతికి పాల్పడుతున్నారని, ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు, ప్రజలను ఇబ్బంది పెడుతున్న సంఘటనలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు.

సీఎండీ దృష్టికి సమస్యలు

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తమ దృష్టికి తెచ్చిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎండీ ముషారఫ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పొలాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలన్నారు. అగ్రికల్చర్ డీపీఆర్‌లకు ఏబీ స్విచ్‌లు పెంచుతామని, మే, జూన్ మాసాల్లో ఏబీ స్విచ్‌లను మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చౌటుప్పల్ మాజీ ఎంపీపీ చిల్కూరీ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మునుగోడు ఇన్‌చార్జి పబ్బు రాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహ, బోయ దేవేందర్ పాల్గొన్నారు.

బయోమైనింగ్ విధానం అమలు చేయాలి



డంపింగ్ యార్డులో అధికారులకు సూచనలిస్తున్న జేడీ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణకు బయోమైనింగ్ విధానం ఎందుకు అమలుచేయడం లేదని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ మునిసిపల్ అధికారులను ప్రశ్నించారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మునిసిపల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. దశాబ్దాల క్రితం నియమితులైన ఎస్ఎంఆర్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు అవసరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి పట్టణంలోని డంపింగ్ యార్డును సందర్శించారు. బయో మైనింగ్ విధానంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, స్థలం సరిపోదనే సమస్య ఉండదన్నారు. చెత్త నుంచి ఎరువుల ఉత్పత్తి చేయొచ్చని, రీసైక్లింగ్ జరపొచ్చన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాల మేరకు బయో మైనింగ్‌కు విధాన అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డంపింగ్ యార్డును పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పరిసరాలను పచ్చని చెట్లతో నింపాలన్నారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, టీపీవో కట్టెబోయిన అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఆర్వో జ్ఞానేశ్వరి, అధికారులు శంకర్, చరణ్ తేజ, శ్వేత, షెహబాజ్, అనిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటి మట్టం 512 అడుగులు



నాగార్జునసాగర్, మే 13(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590.00 అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుత నీటిమట్టం 512.90అడుగులు(136.6461 టీఎంసీలు)గా నమోదైంది. ఎడ మకాల్వ, కుడి కాల్వ, విద్యుత్‌కేంద్రం ద్వారా నీటి విడుదల లేదు. ఎస్ఎల్‌బీసీ ద్వారా 450 క్యూసెక్కులు, వరద కాల్వకు నీటి విడుదల లేదు. ఎగువ నుంచి నీటి రాక లేదు.

వేసవిలోనూ నిండు కుండలా..

• రెండు సీజన్లకు సాగు నీరిచ్చినా తగ్గని మూసీ ప్రాజెక్టు నీరు • పెరుగుతున్న నీటి మట్టం



నీటితో తొణికిసలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు మండుతున్న పరిస్థితుల్లోనూ మూసీ ప్రాజెక్టు నీటితో నిండుకుండలా తొణికిసలాడుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద నీటివనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు ఈ ఏడాది తరగని నీటినిల్వలతో కళకళలాడుతోంది. ఈ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో దాదాపు 35వేల ఎకరాల ఆయకట్టుతో పాటు అంతే విస్తీర్ణంలో అక్రమంగా పంపుసెట్లతో నీటి తరలింపు ద్వారా నాన్ ఆయకట్టు భూముల్లో పంటలను రైతులు సాగు చేశారు. అయినా ఎగువ మూసీ పరీవాహక ప్రాంతాలు, హైదరాబాద్ నుంచి నిరంతరాయంగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తోంది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 634.20అడుగులు(2.04టీఎంసీలు)గా ఉంది. గత ఏప్రిల్ 6న యాసంగి సీజన్ పంటలకు సాగు నీటి విడుదలను నిలిపి వేసే నాటికి 623.50అడుగులు (0.71టీఎంసీలు)గా ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం 37 రోజుల్లో 10.07అడుగుల మేర పెరిగి ప్రస్తుతం 634.20 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఎగువ నుంచి 489.11 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 629.15అడుగులుగా ఉండగా ఈ ఏడాది 5అడుగుల మేర నీరు అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో అకాల వర్షం కురిసి ఇన్‌ఫ్లో ఏమాత్రం పెరిగినా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునే వీలుంది. దీంతో ప్రాజెక్టు ఇంజనీరింగ్ యంత్రాంగం ప్రాజెక్టు గేట్ల నిర్వహణ సులువు చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రాజెక్టు క్రస్టు, రెగ్యులేటరీ గేట్లు, గేట్లను ఎత్తేందుకు వినియోగించే విద్యుత్ మోటార్ల పుల్లీలకు ఆయిలింగ్, గ్రీజింగ్ పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

రైతులు సాగు ఖర్చు తగ్గించుకోవాలి



శివారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రమోహన్

భూదాన్‌పోచంపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని తెలుసుకుని రైతులు సాగు ఖర్చు తగ్గించి నికర ఆదాయం పెంచుకోవాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రమోహన్, బాలచందు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శివారెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులకు వరి సాగులో మెలకువలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ. శైలజ, ఏఈవో శిరీష, రామకృష్ణ, ఝాన్సీ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభం

మునుగోడు రూరల్: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని మునుగోడు క్లస్టర్ హార్టికల్చర్ ఆఫీసర్ విద్యాసాగర్ తెలిపారు. మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు ఆర్థిక స్థితిగతులు పెంపొందించేందుకు పంట సాగు ఉపయోగపడుతుందన్నారు. ఆయిల్ పంట సాగు చేసిన రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందన్నారు. బిందు సేద్యంపై ఎస్సీలకు ప్రభుత్వం 100శాతం, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. ఎకరానికి ప్రభుత్వం నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.4200 ఇస్తుందన్నారు. అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, ఏఈవో నిఖిల్, ప్లాంటేషన్ ఆఫీసర్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి, మాజీ సర్పంచ్ నందిపాటి రాధా రమేష్, గ్రామ రైతులు కోనేటి భూమయ్య, పాండు, మారయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునకొండను సందర్శించిన బౌద్ధ భిక్షువులు



నాగార్జునకొండలోని బౌద్ధ స్తూపం వద్ద బౌద్ధ భిక్షువులు

నాగార్జునసాగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధక్షేత్రం నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను మంగళవారం మైసూరులోని సారా మఠానికి చెందిన నావాంగ్ జంగ్సీ, ఆయన శిష్యులు సందర్శించారు. మిస్ వరల్డ్ పోటీదారుల రాక సందర్భంగా ప్రత్యేక సోమవారం పూజా కార్యక్రమానికి వచ్చిన వారు మంగళవారం పర్యాటకశాఖ లాంచీలో నాగార్జునకొండకు చేరుకున్నారు. అక్కడ మ్యూజియం, సింహాళీయం, అశ్వమేథ యాగశాల, స్నాన వాటికలు, బౌద్ధమత స్తూపాలు, నమూనాలను తిలకించారు. నాగార్జునకొండపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారివెంట బుద్ధవనం సీనియర్ అసిస్టెంట్ ఉన్నారు.

ధ్రువీకరణపత్రాల పరిశీలన

భువనగిరి (కలెక్టరేట్), మే 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో పనిచేస్తూ వీఆర్వో వ్యవస్థ రద్దుతో ఇతర శాఖలకు వెళ్లిన వారిని గ్రామ పాలనాధికారుల పేరుతో తిరిగి తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. పలు శాఖలకు వెళ్లిన వీఆర్వోలు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో జీపీవో కోసం యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా 189 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారులకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలను కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో మంగళవారం అధికారులు పరిశీలించారు. వీఆర్ఏ, వీఆర్వో, కారుణ్య ఇతర ద్వారా విధులు వారి అర్హతలు, అందుకు ప్రభుత్వ ఉత్తర్వులను పరిశీలించారు.

ఆటో డ్రైవర్ల హామీలు అమలు చేయాలి

భువనగిరి గంజ్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆటో రథయాత్ర మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు రూ.12వేలు ఇవ్వాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. రూ.8వేలు ఉన్న ఇన్సూరెన్స్‌ను రూ.వెయ్యికి తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు కొమ్ము జగదీష్‌బాబు, జై భీమ్ ఆటో వెల్ఫేర్ సొసైటీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కర్తాల శ్రీనివాస్, ఎస్కే నిజాం, బింగి సురేష్, మాటూరి నాగరాజు, తారాల ఉపేందర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి *
భువనగిరి
ఆలేరు
8 www.andhrajyothy.com ● బుధవారం 14 మే 2025

స్వర్ణగిరీశుడికి తిరువీధి ఉత్సవ సేవ

భువనగిరి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): భువనగిరి స్వర్ణగిరిలో వేంకటేశ్వర స్వామి నిత్య పూజా కైంకర్యాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రాతఃకాలం నుంచి పవళింపు సేవల వరకు సంప్రదాయ రీతిలో జరిపిన పూజలు భక్త జనులను పులకింపజేశాయి. స్వామివారి నిత్య కల్యాణోత్సవం, పలు రీతిలో అభిషేక, అర్చనలు నిర్వహించి ఆలయ తిరువీధుల్లో వైభవంగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, అన్న ప్రసాదాలు స్వీకరించారు.

మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా చెన్నకేశవ్

రామన్నపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా రామన్నపేటకు చెందిన షుటూరియో స్టైల్ అకాడమీ జిల్లా ఉపాధ్యక్షుడు అప్పం చెన్నకేశవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం భువనగిరి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సమావేశంలో ఈ మేరకు ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా చెన్నకేశవ్ మాట్లాడుతూ యువత, ఆడపిల్లలు ఇలాంటి యుద్ధ క్రీడల్లో నైపుణ్యాన్ని సాధించాలని సూచించారు.

వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

మోత్కూరు, బొమ్మలరామారం, తుర్కపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందింపజేసుకోవడానికి 15 రోజులు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించిందని, రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ మంచి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మోత్కూరు, బొమ్మలరామారం, తుర్కపల్లి ఎంఈవోలు టి.గోపాల్‌రెడ్డి, రోజారాణి, వీరజాల మాలతి కోరారు. మంగళవారం ఆయా మండల కేంద్రాల్లో వారు వేర్వేరుగా మాట్లాడారు. మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, బొమ్మలరామారం మండల కేంద్రంతో పాటు చీకటిమామిడి, జలాల్‌పూర్, మర్యాల, తిమ్మాపూర్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, తుర్కపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు మాధాపూర్, దత్తాయపల్లి, వీరారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 15 నుంచి 31 వరకు రోజూ ఉదయం 8నుంచి 11 గంటల వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నామని, అందులో చదరంగం, క్యారమ్స్, కరాటే, యోగా, స్కిప్పింగ్, చిత్రలేఖనం, టెన్నికాయిట్, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్‌స్టడీస్ సబ్జెక్టుల బేసిక్స్ బోధిస్తారన్నారు. ఉదయం 9.30 గంటలకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల 6 నుంచి 9 తరగతుల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రసాయన ఎరువులతో భూసారానికి దెబ్బ


సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరిగుట్ట ఏడీఏ శాంతినిర్మల

తుర్కపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): పంట దిగుబడి రావాలని అధిక రసాయన ఎరువులు వాడితే నేలలో సారం దెబ్బ తింటుందని యాదగిరిగుట్ట ఏడీఏ శాంతి నిర్మల అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో నిర్వహించిన రైతు ముంగిట్లో - శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. సేంద్రీయ వాడకంతో పాటు వరి కంకి దశలో పై పాటు ఎరువుగా పొటాష్‌ను వాడినట్లైతే తాలు గింజ రాదని, అంతే కాకుండా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కాంప్లెక్స్ ఎరువులను అడుగు మందులుగా వాడాలన్నారు. పంట మార్పిడి విధానాన్ని రైతులు తప్పకుండా పాటించినట్లైతే భూమిలో భూ సారం పెరుగుతుందన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులను అరికట్టడానికి ప్రభుత్వం గుర్తింపు పొందిన షాపుల్లోనే కొనుగోలు చేసి, తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలను రైతులుపంటలకు సంబంధించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఇందూధర్ రెడ్డి, డాక్టర్ సూష్త సర్కార్ , ఏవో శ్రీ ఉమ, ఏఈవోలు పృథ్వీరాజ్, కే. రాకేశ్, ఎం. దివ్య, ఎ. జెస్సీ రెబెక్క, రైతులు పాల్గొన్నారు.

టీబీని ఆరంభంలోనే గుర్తించి, నివారించాలి


టీబీ పరీక్షలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద

చౌటుప్పల్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీవై- టీబీ ర్యాపిడ్ టెస్టలతో టీబీ వ్యాధిని ఆరంభ దశలోనే గుర్తించి, నివారించేందుకు అవకాశం ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.యశోద తెలిపారు. చౌటుప్పల్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం తంగడపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీవై- టీబీ ర్యాపిడ్ టెస్టలను డాక్టర్ యశోద ప్రారంభించారు. ఈ సందర్భంగా యశోద మాట్లాడుతూ టీబీ వ్యాధి చికిత్స తీసుకుంటున్న వ్యక్తుల కుటుంబ సభ్యుల తో పాటు వారి బాగోగులను చూసే వ్యక్తులు తప్పని సరిగా ఈ టెస్టలను చేయించుకోవాలని ఆమె అన్నారు. టీబీని ప్రారంభ దశలో గుర్తిస్తే వ్యాధిని కట్టడి చేయడంతో పాటు ఇతరులకు వ్యాప్తి చెందకుండా చూడవచ్చని ఆమె వివరించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో టీబీ టెస్టులు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ కాటం రాజు, ఆరోగ్య విస్తరణాధికారి వసంతకుమారి, టీబీ సూపర్ వైజర్ శ్రీనివాస్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్‌లు వేణు, సరళ పాల్గొన్నారు.

పెరుగుతున్న మహిళలు, పిల్లల సమస్యలు

● *బీఆర్‌బి కోఆర్డినేటర్ అనంతలక్ష్మి*


సమావేశంలో మాట్లాడుతు కోఆర్డినేటర్ అనంతలక్ష్మి

భువనగిరి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు, పిల్లల సమస్యలు క్రమేపీ పెరుగుతున్నాయని బీఆర్‌బీ(బాల రక్ష భవన్) కోఆర్డినేటర్ అనంతలక్ష్మి అన్నారు. షార్ప్ సంస్థ ఆధ్వర్యంలో భువనగిరిలో లింగ ఆధారిత సమస్యలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలపై వివక్ష చూపడం సరికాదన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపాల్సిందేనని అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలను అడ్డుకోవడం ద్వారా మహిళల ప్రయోజనాలను కాపాడవచ్చునని ఇందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. పలు అంశాలపై షార్ప్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ బి.ప్రమీల, వివిధ శాఖల అధికారులు పి.రమణ, ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, డాక్టర్ టి.సాయి, శోభ, భార్గవి, హర్ష, నిఖిత, స్వర్ణలత మాట్లాడారు.

ఆర్టీఐ రక్షక్ మహిళ శిశు రక్షణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా సునీత



రామన్నపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన సునీతను ఆర్టీఐ రక్షక్ మహిళ శిశు రక్షణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు ఆర్టీఐ రక్షక్ మహిళా శిశు రక్షణ రాష్ట్ర అధ్యక్షురాలు చౌదరి సాత్వికరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్టీఐ సతీష్ సునీతకు నియామకపత్రం అందజేశారు.సునీత మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పిస్తానని తెలిపారు.

ఎమ్మెల్యే లేఖ ఇచ్చినా పట్టించుకోవడంలేదు

● *ఏపీఐడీపీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి*

మోత్కూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో గంగా భవాని ఆలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అందుకు అయ్యే ఖర్చు తన నియోజక వర్గ అభివృద్ధి నిధుల నుంచి కేటాయిస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు విద్యుత్ శాఖ ఎస్ఈకి లేఖ రాసినా, ఎస్ఈ చెప్పినా మోత్కూరు ఏడీఈ బాలునాయక్ పట్టించుకోవడం లేదని ఏపీఐడీపీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దత్తప్పగూడెంలో మురళీకృష్ణ యాదవ సంఘం విజ్ఞప్తి, గంగదేవమ్మ ఆలయానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తానని ఎమ్మెల్యే సామేలు గతంలో యాదవులకు ఇచ్చిన హామీ మేరకు ఆయన విద్యుత్ ఎస్ఈకి ఆలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని లేఖ రాశారన్నారు. ఈ నెల18న గ్రామంలో గంగదేవమ్మ పండుగ ఉందన్నారు. ఆ పండుగకు గ్రామానికి బంధువులు, స్నేహితులు వస్తారని, ఆలయంలో పూజలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించడానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, విద్యుత్ లైన్ నిర్మాణానికి అయ్యే ఖర్చు కోసం నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.5లక్షలు కేటాయిస్తానని ఎమ్మెల్యే సామేలు లేఖ ఇచ్చారన్నారన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ చెప్పినా మోత్కూరు ఏడీఈ పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు.

ఏడీఈ వివరణ: ఈ విషయమైన విద్యుత్ మోత్కూరు ఏడీఈ బాలునాయక్‌ను వివరణ కోరగా ఎస్ఈ ఆదేశాల మేరకు గంగదేవమ్మ ఆలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించడానికి ఎస్టిమేషన్స్ (ప్రతిపాదనలు) వేసి పంపామన్నారు. రెండు రోజులు (రెండో శనివారం, ఆదివారం) సెలవులు వచ్చాయని, ఈ రోజు (మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు ఉండటంతో ఎస్ఈ, డీఈ, తాను వెళ్లామన్నారు. ఈనెల 14 (బుధవారం)తాను, ఏఈ కలిసి ఎస్ఈ వద్దకు వెళ్లి, ఆయనతో మాట్లాడి పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఎమ్మెల్యే లేఖను పట్టించుకోవడం లేదన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. పనులు చేస్తున్నా ఇలా ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు.

ఈత సరదా తీరేదెలా?



ప్రైవేట్ ఫామ్‌హౌస్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి

భువనగిరి టౌన్,మే 13 (ఆంధ్రజ్యోతి): వేసవి సరదాలు,శిక్షణల్లో ఈత ప్రధానమైనది. నేటి మధ్య వయసుకు పైబడిన వారందరూ గతంలో విస్తృతంగా ఉండే వ్యవసాయ బావులలో ఈత నేర్చినవారే. మరికొందరు సమీపంలోని వాగులు, చెరువుల్లో ఈత కొట్టారు. కానీ రియల్ ఎస్టేట్ తదితర కారణాలతో వ్యవసాయ బావులు కనుమరుగు కాగా, నిర్వహణ లోపంతో చెరువులు, వాగులు ప్రమాదకరంగా మారాయి. దీంతో నేటితరం ఈత సరదాలు తీరాలంటే ఓ ప్రయాసగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తామని నాయకులు, అధికారులు దశాబ్దాలుగా ఇస్తున్న హామీలు ఎండమావులను తలపిస్తున్నాయి. దీంతో పిల్లలు ఈత నేర్చుకోవాలన్నా, పెద్దల ఈత సరదా తీరాలన్నా ప్రైవేట్ ఫామ్‌హౌస్‌లలోని స్విమ్మింగ్ పూల్స్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి. అయితే ఫీజు చెల్లించలేక, దూరంగా ఉండే ఫామ్‌హౌస్‌లకు వెళ్లలేక పలువురు పిల్లలు, పెద్దలు ఈత సరదాలకు దూరమవుతున్నారు.

దశాబ్దాల కల

స్విమ్మింగ్ పూల్ భువనగిరి వాసుల దశాబ్దాల కల.పట్టణ సమస్యల ప్రస్తావన వచ్చిన ప్రతి సందర్భంలో, అన్ని స్థాయిల ఎన్నికల్లో స్విమ్మింగ్ పూల్ హామీ తప్పనిసరిగా ఉండటం పరిపాటిగా మారింది. స్విమ్మింగ్ పూల్ నిర్మాణం పేరిట గతంలో స్థల ఎంపిక, అంచనాలు, డీపీఆర్ కూడా పూర్తి చేశారు. నిర్మాణం పూర్తయ్యాక మునిసిపల్ ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయం కూడా జరిగింది. కానీ ఆ హామీలన్నీ ప్రజలను ఊరించాయి తప్ప కార్యరూపం దాల్చలేదు. పట్టణ శివారులో కొంత కాలం క్రితం వరకు ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్స్ వేసవిలో నిర్దేశిత చార్జీలతో ఔత్సాహికుల ఈత సరదాలను తీర్చేవి. కానీ పలు కారణాలతో నిర్వాహకులు కొంతకాలం క్రితం మూసివేశారు. దీంతో ఈత నేర్చుకోవాలనుకున్న చిన్నారులకు ప్రతీ వేసవి నిరాశను మిగిలిస్తోంది. నీటి ప్రమాదాల నుంచి రక్షణ పొందడానికి,శారీరక పటుత్వానికి ఈత ఎంతో దోహదపడుతుంది.కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలకు కూడా ఈత పరిష్కారం చూపుతుంది. ఇంతటి ప్రాధన్యం ఉన్న ఈత కొట్టే అవకాశాలను కల్పించాలని, దీర్ఘకాలిక ఎదురుచూపులు నెరవేరేలా స్విమ్మింగ్ పూల్ నిర్మించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వచ్చే వేసవి నాటికి అందుబాటులోకి తెస్తాం



భువనగిరిలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి పరిశీలిస్తాం. నేను కూడా చిన్నప్పుడు మా వ్యవసాయ బావిలో ఈత కొట్టాను. కానీ నేడు ఆ పరిస్థితుల్లో లేవు. దీంతో ప్రజల ఆరోగ్యం, సరదా కోసం స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తాం. పట్టణ వాసుల దీర్ఘకాలిక ఆకాంక్షను నెరవేరుస్తాం. ఈ మేరకు అధికారులతో చర్చిస్తాం. వచ్చే వేసవి నాటికి స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రయత్నిస్తాం.

- కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఈత నేర్చుకోవాలని ఉంది



స్విమ్మింగ్ అంటే నాకు చాలా ఇష్టం. నేర్చుకోవాలని చాలా ఆశగా ఉంది. కానీ స్విమ్మింగ్ పూల్స్ అందుబాటులో లేకపోవడంతో నా ఇష్టం నెరవేరడం లేదు. దీంతో స్విమ్మింగ్ పూల్స్, స్విమ్మింగ్‌ను సినిమాల్లో చూడటం వరకే పరిమితమవుతున్నాను. చిన్నప్పుడే ఈత నేర్చుకుంటే పెద్దయ్యాక కూడా ఉపయోగపడుతుంది.

- ఆర్.మాన్విక, ఏడో తరగతి, భువనగిరి

ఈతతో ఆరోగ్యం



ఈత ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుంది. క్రమంగా ఈత కొట్టే వారిలో శ్వాసకోశ, ఊపిరితిత్తులు, గుండె ఆధారిత తదితర ఆరోగ్య సమస్యలు తక్కువగా ఉంటాయి. మానసిక ఒత్తిడి నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. దీంతో వీలైనప్పుడల్లా ఈత కొట్టడం మంచిది. లేనిపక్షంలో కనీసం వేసవిలోనైనా తప్పనిసరిగా ఈకొట్టేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.

- డాక్టర్ ఓవైసీ, భువనగిరి



ప్రతీ ఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలి

యాదగిరిగుట్ట రూరల్, మే 13, (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ ఒక్కరు దైవ భక్తిని అలవర్చుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గౌరాయిపల్లి గ్రామంలో వడ్డెర కులస్థులు నిర్వహించిన గ్రామ దేవత రేణుకదేవి బోనాల ఉత్సవాలకు హాజరయ్యారు. అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పెడదారిన పడకుండా ఆధ్యాత్మిక చింతనకు దేవాలయాలు భక్తి మార్గం పెంపొందించడానికి దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, బందారపు భిక్షపతిగౌడ్, నిర్వహకులు బొంత చంద్రయ్య, పల్లపు నర్సింహ, అంజనేయులు, కాంగ్రెస్ నాయకులు శివరాత్రి కిష్టయ్య, అయిలయ్య, పల్లపు శ్రీశైలం పాల్గొన్నారు.


యాదగిరిగుట్ట రూరల్: రేణుకదేవి కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అయిలయ్య


రామన్నపేట: ఎల్లమ్మ కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మారమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి దయతో నకిరేకల్ నియోజకవర్గ ప్రజలంతా సంతోషంగా, సుభిక్షంగా ఉండాలని తల్లిని వేడుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, ఎడ్ల మహేందర్‌రెడ్డి, నాయకులు తాటిపాముల శేఖర్, అయిటిపాముల పెద్దులు, పున్న నర్సింహ, పున్న రమేష్, సోమప్ప, అయిటిపాముల సైదులు, వివిధ పార్టీల నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

ఆలేరు, మే13 (ఆంధ్రజ్యోతి): ఆలేరు తదితర ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ ఈదురు గాలులు వీచి స్వల్ప వర్షం పడడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయి. దీంతో 2గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆలేరు- రఘునాథ్‌పూర్ రోడ్డు మధ్య 3 విద్యుత్ స్తంభాలు , చెట్లు విరిగి పడ్డాయి. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కూలిన విద్యుత్ స్తంభాల తీగలను తొలగించి విరిగిపడ్డ చెట్లను తొలగించారు.

కురుమలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి

ఆలేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆలేరు మండలంలోని కురుమ సామాజిక వర్గాలు సామాజిక, రాజకీయ, ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని కురుమ సంఘం మండల అధ్యక్షులు బండ పర్వతాలు కోరారు. మంగళవారం మండలంలోని సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. కురమలు ఐక్యంగా ఉండి ప్రభుత్వానికి సమస్యలు విన్నవించి హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షులు ఎగ్గిడి శ్రీశైలం, నాయకులు శ్రీనివాస్, పిక్క శ్రీను, బండి నాగయ్య, రవి, భిక్షపతి, కొమురయ్య, మంగ నర్సింహులు, మల్లేశ్, వెంకటేశ్, ఎడ్ల సిద్దులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

గుండాల, మే13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇచ్చారు. పశువైద్యాధికారి డాక్టర్ యాకూబ్ మాట్లాడుతూ పశువులలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈసందర్భంగా గ్రామంలోని 246పశువులకు టీకాలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఏ రాజు, గోపాల మిత్రలు గోవింద్, కిష్టయ్య పాల్గొన్నారు.

కార్మికుల శ్రమను దోచుకునేందుకే లేబర్‌కోడ్లు



సమావేశంలో మాట్లాడుతున బాల్‌రాజు

భువనగిరి గంజ్, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రమను దోచుకోవడానికే కేంద్రం ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్లను తీసుకువచ్చిందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.బాల్‌రాజు అన్నారు. మంగళవారం భువనగిరి జిల్లా కేంద్రంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో జిల్లా కౌన్సిల్ సమావేశం పిల్లి శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తోందని అన్నారు. వాటిని కార్మికులు ఐక్యంగా పోరాడి తిప్పి కొట్టాలన్నారు. 44కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, అసంఘటితరంగా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్ట సవరణలు ఉపసంహరించుకోవాలని ఈనెల 20న జరిగే దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసఫ్, ఎం.నరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, యానాల దామోదర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు బొలగాని సత్యనారాయణ, గోరేటి రాములు, ఎండీ.ఇమ్రాన్, వెంకటేష్, హేమలత, సోమన సబిత, మల్లేష్, శోభన్‌బాబు, అంజయ్య, భాస్కర్, వసంత, రాజు, బసవయ్య, లింగయ్య, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

రామన్నపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు శారీరక, దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని గరిక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గరిక సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని లోతుకుంట క్రీడా మైదానంలో గరిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో గరిక లక్ష్మమ్మ బచ్చయ్య, వారి కుమారుడు గరిక యాదగిరి స్మారకార్థం గరిక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గరిక సత్యనారాయణ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో భాగస్వామ్యం కావాలని ఆయన అన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా స్నేహ పూర్వకంగా పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మహ్మద్ నాజర్, బొడ్డు సురేందర్‌రావు, జమీరుద్దీన్, కోట సుధాకర్, పెద్దబోయిన మణి, వనం చంద్రశేఖర్, కొమ్ము రామస్వామి, గోదాసు ప్రవీణ్, కొమ్ము శేఖర్, బుర్రి రవీందర్, గొలుసుల ప్రసాద్, పల్లపు రవి, దండుగుల శివరంజన్, లవణం, సాయి, మీర్జా, మజీద్ బేగ్, జింకల ప్రసాద్, ప్రవీణ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అందగత్తెలకు గుర్తుండేలా..

(5వపేజీ తరువాయి)

సాగనుంది. షెడ్యూల్ ప్రకారం ఇక్కడకు చేరుకున్న అందాలభామలు ముందుగా అఖండ దీపారాధన చేసి తర్వాత అక్కడినుంచి తూర్పురాజగోపురం (ఆలయం) వరకు వస్తారు. అక్కడినుంచి స్వర్ణ దివ్య విమాన రాజగోపురం దర్శించుకొని త్రితల రాజగోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి, అదే మార్గంలోని క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి, ధ్వజస్తంభానికి మొక్కులు చెల్లించుకుంటారు. ఆ తర్వాత అంతరాలయంలోని స్వయంభువులను దర్శించుకొని అనంతరం ఉపాలయాల్లో ఆండాల్ అమ్మవారు, ఆళ్వార్లను దర్శించుకొని గర్భాలయానికి అభిముఖంగా ఆశీర్వచనం తీసుకుంటారు.

అక్కడినుంచి ఆలయ అందాలు వీక్షిస్తూ పశ్చిమ రాజగోపురం ద్వారా ఆలయం వెలుపలకు వస్తారు. అనంతరం ఆలయ ప్రాకార మండపాలు, తిరువీధుల్లో పర్యటించి తిరుగు ప్రయాణమవుతారు.

ప్రపంచ సుందరీమణుల సందర్శనకు పటిష్ఠ ఏర్పాట్లు


భూదాన్‌పోచంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరీమణుల సందర్శనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. భూదాన్‌పోచంపల్లికి ఈ నెల 15న ప్రపంచ సుందరీమణుల పర్యటన పురస్కరించుకుని మంగళవారం పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్‌లో చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. పోచంపల్లి టూరిజం పార్కులో పనులను వేగవంతం చేయాలన్నారు. పోచంపల్లి చేనేత వస్త్ర పరిశ్రమ మ్యూజియంలో పనులను టూరిజం అధికారులతోపాటు పోలీసు ఉన్నతాధికారులతో కలిసి పర్యవేక్షించారు. రాష్ట్ర సంచాలకులు డాక్టర్ లక్ష్మీతోపాటు ఆయన టూరిజం సెంటర్ సందర్శించారు. మ్యూజియంలో చూపరులను ఆకట్టుకునేలా చేనేత వస్త్రాల ఫొటోలు ఏర్పాటు చేయాలన్నారు. హంపి థియేటర్‌లో ప్రదర్శనలు ఉంటాయన్నారు. విశ్వసుందరీమణుల రాకతో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో భాగమైన చేనేత వస్త్ర పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా విశ్వవ్యాప్తం కానుందన్నారు. అంతర్జాతీయపరంగా మార్కెట్ పెరిగి నేతన్నల జీవితాల్లో వెలుగులు చూస్తామన్నారు. కోలాటాలతో విశ్వసుందరీమణులకు స్వాగతం ఉంటుందని, చేనేత వస్త్రాలపై వివిధ స్టాల్స్ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఇక్కత్, డబుల్ ఇక్కత్ లను వివరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో టూరిజం కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఉపేందర్ రెడ్డి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఏసీపీలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్తనిధి కోసం తిప్పలు

(5వపేజీ తరువాయి)

వార్డును నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లాయంత్రాంగం దృష్టికి తీసుకెళ్లారు. భువనగిరిలో బ్లడ్ బ్యాంకుతోపాటు తలసేమియా వార్డును నిర్మించిన పక్షంలో ఉమ్మడి వరంగల్, నల్లగొండ, మేడ్చల్, మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. రక్తంకోసం హైదరాబాద్ వెళ్లకుండా ఇక్కడే స్థానికంగా ఉన్న ఆస్పత్రిల్లో చికిత్సలు చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. తద్వారా రోగులకు ఆర్థికంగా ఇబ్బందుల్లేకుండా ఉంటుంది. అయితే భువనగిరి పట్టణంలోని జూనియర్ కళాశాల, పాఠశాల ఆవరణలో స్థలాన్ని గుర్తించినట్లు తెలిసింది. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? అనే అంశంపై జిల్లాయంత్రాంగం ఆరా తీస్తోంది. బ్లడ్‌బ్యాంకు నిర్మించేందుకు దాత లు ముందుకు రావడంతో స్థలాన్ని త్వరగా కేటాయించాలని రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు కలెక్టర్ ఎం.హనుమంతరావుకు ఇటీవల విజ్ఞప్తి చేశారు. అయితే ఏ ప్రాంతంలో అయితే బాగుంటుందో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు కలెక్టర్ సూచించినట్లు సమాచారం.

దాతల సహకారంతో నిర్మాణం



జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. భువనగిరి పట్టణంలో 1500-2000 గజాల స్థలాన్ని కేటాయిస్తే రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.2కోట్లతో భవనాన్ని నిర్మించనున్నాం. భవనం నిర్మాణం కోసం దాతలను కూడా ముందుకు వస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని ఉన్నతాధికారులకు స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశాం.

-దిడ్డి బాలాజీ, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ వైస్‌చైర్మన్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

భూదాన్‌పోచంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దరావులపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పెద్దరావులపల్లి కేంద్రంలోని నిర్వాహకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన రికార్డులు మెయింటెన్ చేయకపోవడంతోపాటు రిజిస్ట్రేషన్ ఇంకా బస్తాలపై నెంబర్లు వేయకపోవడంతో ఆయన నిర్వాహకులను హెచ్చరించారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

బొమ్మలరామారం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మన్నె శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కొత్త కొత్త మెలికలు పెట్టడంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో రాజా త్రివిక్రమ్‌కు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలంటూ వినతిపత్రాన్ని అందజేశారు.